ప్రజాశక్తి
సోమవారం 6 నవంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కాలుష్యం తప్ప ఉపాధి ఏదీ ?

◆ తొమ్మిదేళ్లుగా ఏపికి కేంద్రం అన్యాయం చేస్తున్నా జగన్ మౌనం ◆ రాష్ట్రంలో అసమానతలకు సిపిఎం ప్రత్యామ్నాయ విధానమే పరిష్కారం
◆ ప్రజారక్షణ భేరి సభల్లో వక్తలు ◆ అనకాపల్లిలో బస్సుయాత్రకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం



పరవాడ పెద్ద చెరువులోకి చేరిన రాంకీ ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న యాత్రా బృందం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, పరవాడ, అచ్యుతాపురం, అనకాపల్లి, ఎస్.రాయవరం విలేకరులు

అనకాపల్లి జిల్లాలో ప్రజలకు కాలుష్యం తప్ప ఉపాధి ఏది ? అని పలువురు వక్తలు ప్రశ్నించారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం జిల్లాలోని లంకెలపాలెం, పరవాడ, ఫార్మా గ్రామాలు, అచ్యుతాపురం, అనకాపల్లి, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు ప్రాంతాల్లో సాగింది. అన్ని చోట్లా ఈ యాత్రకు అపూర్వ స్పందన లభించింది. పూలు జల్లి ప్రజలు స్వాగతం పలికారు. తిలకం దిద్ది హారతులిచ్చారు. యాత్ర ఆద్యంతం ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

ఆదివారం ఉదయం 8 గంటలకు లంకెలపాలెంలో అడుగుపెట్టిన సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్రా బృందం లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురంల్లో పలు కాలుష్య పరిస్థితులతో ప్రజలు అవస్థలు పడడాన్ని కళ్లారా చూసింది. ఎక్కడికక్కడే వివిధ తరగతుల ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను పెద్ద సంఖ్యలో బృందానికి అందజేశారు. ఆర్థిక అసమానతలు నెలకొన్నాయని, నేల, నీరు, గాలి అంతా కాలుష్యమయంగా మారిపోయి జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వాలేవీ తమను పట్టించుకోవడం లేదని లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురంలో పలువురు ఆవేదన వెళ్లగక్కారు. తొమ్మిదిన్నరేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బిజెపి అన్ని విధాలా అన్యాయం చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మౌనం దాల్చుతూ ప్రజలను మోసం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఎద్దేవా చేశారు. అనకాపల్లి జిల్లాను ఏర్పాటు చేసినా ఏం లాభమని ఏ అధికారిని మిగతా 2లో..



వినతిని స్వీకరిస్తున్న సిహెచ్.నర్సింగరావు, నాగేశ్వరరావు



అచ్యుతాపురంలో సాగుతున్న ర్యాలీ



మారథాన్‌లో విజేతలుగా నిలిచిన యువతులు

నేవీ మారథాన్‌లో విజేతలు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఇండియన్ నేవీ ఆధ్వర్యాన విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ విజయవంతంగా సాగింది. వివిధ కేటగిరీలలో సుమారు 20 వేల మంది పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో పలువురు విజేతలయ్యారు. పురుషుల ఓపెన్ కేటగిరిలో 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో సికందర్ తడాఖే 2.30 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలవగా, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో దీపక్ కుంభార్ 1.06 గంటల్లో, 10కె రన్‌ను సోను కుష్వాహ 0:31 గంటల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు.

మహిళల ఓపెన్ కేటగిరీలో 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో టిపి ఆశ 3.08 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో లిలియన్ రుట్టో 1.24 గంటల్లో, 10కె రన్‌ను లంక మేరీ గ్రేస్ 0:44 గంటల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అవార్డులను ప్రదానం చేశారు.

నూతన పెన్షన్ విధానం కార్మికులకు నష్టం

▶ వార్త 8లో..

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

▶ వార్త 2లో..

దళిత యువకునిపై దాడి హేయం

▶ వార్త 4లో..

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త 5లో..



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు, వామపక్ష, పౌర ప్రజా సంఘాల నాయకులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం ఆపాలి

విశాఖలో భారీ శాంతి ర్యాలీ

వార్త మెయిన్‌లో...

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

కార్తీక మాసం దృష్ట్యా సరికొత్త ఏర్పాట్లు
'ప్రజాశక్తి'తో టూరిజం సెల్ మేనేజర్ ఎన్.మురళి



ప్రజాశక్తి - అరకులోయ : పర్యాటక రంగ అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు రచించినట్టు ఐటిడిఎ పాడేరు టూరిజం సెల్ మేనేజర్ ఎన్.మురళి తెలిపారు. పర్యాటక ప్రదేశాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఈ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే అరకులోయ ప్రాంతంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఆయన్ని ఇటీవల 'ప్రజాశక్తి' కలవగా పలు విషయాలు వెల్లడించారు.



కార్తీక మాసాన్ని దృష్టిలో పెట్టుకొని పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఐటిడిఎ ద్వారా తీసుకుంటున్న చర్యలేంటి ?

పర్యాటకులను ఆకట్టుకునేందుకు అరకులోయలోని గిరిజన సాంస్కృతిక మ్యూజియంలో ఇటీవల ఆధునికీకరణ పనులు చేపట్టాం. సహజత్వం ఉట్టిపడేలా శిల్పాకృతులను తీర్చిదిద్దాం. మ్యూజియంలో త్రీడీ గ్యాలరీని ఏర్పాటు చేశాం. ఇది వీక్షించిన పర్యాటకులు ప్రత్యేక అనుభూతిని పొందుతున్నారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో భాగంగా మ్యూజియం ఆవరణలో జిప్ లైన్, స్కై సైకిళ్లతో పాటు రోప్ కోర్స్, కమాండోనేట్‌ను అదనంగా అందుబాటులోకి తీసుకొచ్చాం. పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని ప్రతి శని, ఆదివారాల్లో థింసా నృత్యాలను ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. మ్యూజియం ఆవరణలో బోటు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కాలుష్యం తప్ప ఉపాధి ఏదీ ?

ఎక్కడ నియమించారో ఎవ్వరికీ అర్థం కావడం లేదని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. దేశ ప్రధాని మోడీ అటు అదానీ, ఇటు అంబానీలకు లాభం చేస్తూ రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తున్నా జగన్ పట్టించుకోవడం లేదన్నారు. సిపిఎం చెబుతున్న ప్రత్యామ్నాయ విధానం అమలు చేస్తే విద్యుత్ యూనిట్‌ను ఒక్క రూపాయికి, గ్యాస్‌ను రూ.400కు, పెట్రోల్‌ను రూ.60కే ఇవ్వొచ్చని అన్నారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే కేరళ తరహా విధానం అమలు చేయాలని యాత్ర రథసారధి కె.లోకనాథం, సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, బి.ప్రభావతి, హరిబాబులు పలు సభల్లో ఉద్ఘాటించారు. రాష్ట్ర పాలన కేంద్రం అడుగులకు మడుగులొత్తుతూ వెళ్తోందని, ఆ బంధం తెచ్చుకుని రాకపోతే రాష్ట్రం అసమానతలతో నాశనం అవుతుందని తెలిపారు. దేశం, రాష్ట్రంలో ప్రజల సంపదలను లూటీచేస్తున్న పలువురు ఎంపీలు, ఎంఎల్ఎలకు జీవితకాలం పెన్షన్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలున్నాయని లోకనాథం అన్నారు. 60 ఏళ్లు ఉపాధ్యాయులుగా సేవలందించిన వారి పెన్షన్‌కు జగన్ సర్కారు ఎంతటి ఇబ్బందులు పెడుతోందో వివరించారు. జిపిఎస్ పేరిట ఉద్యోగులను ఎలా మోసం చేసిందో తెలిపారు. స్కీం వర్కర్లకు పాదయాత్రలో ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదన్నారు. ఇలానే వెళ్తే 2024 ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కి జగన్‌ను ఓడిస్తారని హెచ్చరించారు.

వినతులు ఇలా..

అనకాపల్లి – అచ్యుతాపురం రోడ్డును అడిగినా నాలుగేళ్లుగా వేయలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందంటూ స్థానిక ప్రజలు బస్సు యాత్ర బృందానికి వినతిపత్రం అందజేశారు. అచ్యుతాపురం సెజ్‌కి భూములిచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ఇంకొందరు వినతి సమర్పించారు. లంకెలపాలెంలో తాడి గ్రామస్తులు సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావును కలిసి తమ గ్రామాన్ని కాలుష్యం బారి నుంచి రక్షించాలని వినతిపత్రం అందించారు. యాత్ర సాగిన అన్ని ప్రాంతాల్లో బహిరంగ సభలు జరిగాయి. వీటిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, ఎం.అప్పలరాజు, జిల్లా నాయకులు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు, ఎ.బాలకృష్ణ, జి.నాయనబాబు, వై.దేముడు, దేముడునాయుడు, నరసింహమూర్తి, నాయుడు, బి.ఉమామహేశ్వరరావు, పి.మాణిక్యం, వివి.రమణ, ఆర్.రాము, క్రరి అప్పారావు, జి.దేవుడు నాయుడు, కె.సోము నాయుడు, కె.రామ సదాశివరావు, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

షికారుకుగాను ఏర్పాటు చేసిన నాలుగు బోట్లలో రెండు మరమ్మతుకు గురయ్యాయి. వాటిని త్వరలో అందుబాటులోకి తెస్తాం.

ఐటిడిఎ పరిధిలో పర్యాటకులు చూడదగిన సందర్శిత ప్రాంతాలు ఏమేమున్నాయి?

అరకులోయలో గిరిజన సాంస్కృతిక మ్యూజియం, పద్మావతి గార్డెన్, గంజాయిగూడలో గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండల కేంద్రానికి సమీపంలో చాపరాయి జలపాతం, కొత్తపల్లి వాటర్‌పాల్, చెరువుల వ్యాన్ వంటివి ఉన్నాయి. తాజంగిలో అడ్వెంచర్ స్పోర్ట్స్, జిప్ లైన్, బోటింగ్, ఆర్చరీ సౌకర్యాలు ఉన్నాయి. పద్మావతి గార్డెన్ లోపల పాడేరు ఐటిడిఎ సుమారు రూ.36 లక్షలతో ట్రీ హౌస్ స్థానంలో నిర్మించిన ట్రీ కాస్టిల్ గెస్ట్ హౌస్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకోనుంది.

పర్యాటక ప్రాంతాల్లో గతం కన్నా ఇప్పుడు తెచ్చిన మార్పులేంటి ?

గతంలో సౌకర్యాలు అక్కడక్కడా కొరతగా ఉండేవి. వాటిని ప్రస్తుతం పరిష్కరించి ముందుకు సాగుతున్నాం. చాపరాయి జలపాతం వద్ద ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.

గతంతో పోలిస్తే టూరిస్టులు తగ్గారా ? పెరిగారా ?

కరోనా సమయంలో టూరిస్టుల తాకిడి తగ్గింది. ఆ తరువాత కాలంలో పరిస్థితులు పూర్వ స్థితికి వచ్చాక టూరిస్టులు క్రమేపీ పెరుగుతూ వచ్చారు. హైవే రోడ్డు రావడంతో మౌలిక వసతులు కూడా పెరిగాయి.

పర్యాటక అభివృద్ధిపై ఐటిడిఎ భవిష్యత్తు ప్రణాళిక ఏంటి ?

పాడేరు ఐటిడిఎ ద్వారా కొత్తకొత్త పర్యాటక సందర్శిత ప్రాంతాలను అన్వేషిస్తున్నాం. అందులో భాగంగానే మాడగడ సన్రైజ్ ప్రాంతాన్ని గుర్తించాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐటిడిఎ తీవ్ర కృషి చేస్తోంది. డుంబ్రిగుడ మండల పరిధిలోకి వచ్చే అంజోడా సిల్క్ ఫారంను కూడా అటవీశాఖ అధికారులు ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు.

మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

పర్యాటక ప్రాంతంలో హైవే రోడ్డు రావడంతో చెట్లన్నీ తొలగించడం వల్ల పచ్చదనం తగ్గింది. ప్రతి ఒక్కరూ చెట్టు నాటే కార్యక్రమం చేపడితే అరకులోయకు పూర్వ వైభవం వస్తుంది. విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం అందరి సహకారంతో చేపట్టనున్నాం. స్వచ్ఛ అరకుపై దృష్టిపెట్టాం. కొత్తవలస హెచ్ఎన్‌టిసి గార్డెన్‌లో కూడా పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో 12 కాటేజీల నిర్మాణం జరుగుతోంది. కొత్తగా వేసిన హైవే రోడ్డుకు ఇవి సమీపంలోనే ఉండడంతో మంచి ఆదరణ లభించనుంది.

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 2020 నుంచి 2023 సంవత్సరాలలో ఆర్‌టిసిలో అనేక కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగులకు ఇంతవరకు యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని ఎపిఎస్ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధర్‌రావు డిమాండ్‌చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు 1500 మందికి గ్రాట్యుటీ ఎరియర్స్ చెల్లించలేదన్నారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫండ్స్ విడుదల చేయని కారణంగా గ్రాట్యుటీ చెల్లించలేకపోతున్నట్లు యాజమాన్యం అంటుందని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కాలంలో అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు మరణిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఫండ్స్ రావాలని ఆర్టీసీ యాజమాన్యం చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. పిఎఫ్ హయ్యర్ ఆప్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 2013 2017 పే స్కేల్స్ యొక్క నిజమైన వేతనాలపై లెక్కలు కట్టి పెన్షన్ ఖరారు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒను అనుసరించి మరణించిన ఉద్యోగులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చెల్లించాలని, సూపర్ లగ్జరీ బస్సులలో రిటైర్డ్ ఉద్యోగుల భార్యకు ఉచిత ప్రయాణానికి అనుమతించాలని, కేంద్ర పిఎఫ్ బోర్డు ఇపిఎస్- 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు, డిఎ చెల్లించాలని, ఎపిఎస్ఆర్‌టిసి పిఎఫ్ ట్రస్ట్‌లో పెండింగ్‌లో ఉన్న వందలాది కేసులను త్వరగా పరిష్కరించాలని, ఎపిఎస్ఆర్‌టిసి క్లినిక్స్‌లో రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, ఆర్‌టిసి క్లినిక్‌లో ఇద్దరు డాక్టర్లు సర్వీస్ చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, 35 సంవత్సరాలు ఆర్‌టిసిలో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు ఆర్‌టిసిలోని హోటల్స్‌లో భోజనం, కాఫీ, టీ, టిఫిన్‌కు రాయితీ చార్జీలు తీసుకునేటట్లు యాజమాన్యం ఆదేశాలు ఇవ్వాలని, ఆర్‌టిసి (ఎపిపిటిడి)లో రిటైర్ అయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్యశ్రీ ఇతర పథకాలు వర్తింపచేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.తులసీరాం, ఉపాధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ఎపిఆర్‌ఎ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ షర్ట్ వాలంటీర్లకు కవాతు శిక్షణ



కవాత్ చేస్తున్న రెడ్‌షర్ట్ వాలంటీర్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ సిపిఎం తలపెట్టిన బస్సు యాత్ర ముగింపు రోజైన ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే మహా ప్రదర్శనలో విశాఖపట్నం నుంచి పాల్గొనే రెడ్ షర్ట్ వాలంటీర్లకు ఆదివారం శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల పార్టీగా సిపిఎంకు గుర్తింపు ఉందన్నారు. ఓట్లు, సీట్ల రాజకీయాలకతీతంగా నిత్యం ప్రజా పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా నిలబడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన ప్రజలను ముంచుతూ, కార్పొరేట్లకు కొమ్ముకాసేదిగా ఉందని విమర్శించారు. సిపిఎం ప్రదర్శనల్లో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. వేలాది సంఖ్యలో యువతరం రెడ్ షర్ట్ వాలంటీర్లుగా ప్రదర్శనలో పాల్గొంటారని, ఇందులో భాగంగా విశాఖపట్నం రెడ్ షర్ట్ వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దేశ శ్రేయస్సు కోరే యువతీ యువకులు ఈ కవాతులో పాల్గొనవచ్చని తెలిపారు. సిపిఎం కంచరపాలెం జోన్ నాయకులు శ్రావణ్ కవాత్ శిక్షణ ఇవ్వగా, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.జగన్, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, కుమార్, అధిక సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు అందరి హక్కు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు మనందరి హక్కుఅని, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 946వ రోజుకు చేరాయి. దీక్షల్లో చిట్టివలస లేబర్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన దేశానికి వెన్నెముకలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ అమ్మకానికి పెట్టి దేశాన్ని దివాలా తీయిస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలను ఆపి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, చిల్ల రాంపైడి, వై.కొండయ్య, ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

సర్వ రోగ నివారిణి ఆయుర్వేదం

కేంద్ర ఆయుష్ ఏడీ వెంకటేష్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతీయులంతా ఆయుర్వేద వైద్యం తీసుకోవాలని కేంద్ర ఆయుష్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డి.వెంకటేష్ కోరారు. ధన్వంతరి జయంతి (నవంబర్ 10)ని పురస్కరించుకుని కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యాన బీచ్ రోడ్ ఏయూ ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటుచేసిన రైడర్స్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏ దేశంలో పుట్టిన ప్రజలు ఆ దేశ వైద్య విధానం పాటించాలని సూచించారు. ఆయుర్వేదంలో అన్ని రకాల వైద్యం అందుబాటులో ఉందన్నారు. విమ్స్ ఆస్పత్రి ఆవరణలో త్వరలోనే 50 పడకల ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణం చేపడతారని తెలిపారు. ఆయుష్ పూర్వ సీనియర్ మెడికల్ ఆఫీసర్ (కెజిహెచ్) డాక్టర్ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ, కెజిహెచ్, మధురవాడ, ఆనందపురం, ఉక్కునగరం, గాజువాక తదితర ప్రాంతాల్లో ఆయుష్ క్లినిక్‌లు ఉన్నాయని తెలిపారు. అనంతరం సిరిపురం, మద్దిలపాలెం, జూ పార్క్ మీదుగా రైడర్స్ ర్యాలీ తిరిగి ఏయూ మైదానానికి చేరుకున్నారు. ఈ ర్యాలీలో వంద మంది రైడర్స్ పాల్గొన్నారు. ఆయుష్ అధికారులు వీరికి సర్టిఫికెట్లు, ఆయుష్ మందుల కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ పరిశోధక అధికారి ఏజే వి.సాయిప్రసాద్, వరల్డ్ రైడర్ ధవళ భరద్వాజ, డ్రాగన్ వౌడే క్లబ్ నిర్వాహకుడు పి.కిరణ్ కుమార్, పలువురు ఆయుష్ వైద్యులు పాల్గొన్నారు.

ఆదివారం తరగతులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆదివారం సెలవు దినమైనప్పటికీ పదో తరగతి, ఇంటర్ సిలబస్ పూర్తి కాలేదన్న నెపంతో నగరంలో ప్రత్యేక తరగతులు నిర్వహించిన కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలపై తక్షణమే చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమించాలని ఇంటర్మీడియట్ ఆర్ఐఒ, జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలిచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి నెలా రెండో శనివారం, ప్రతి ఆదివారమూ సెలవులను అమలు చేయాల్సిందేనని స్పష్టంచేశారు. రాష్ట్రంతో పాటు విశాఖ నగరంలోని ఏ స్కూల్, కాలేజీలకు సెలవు అమలులో ప్రత్యేక మినహాయింపులు లేవని తెలిపారు. సెలవులు పాటించని స్కూళ్ల వివరాలతో సమాచారాన్ని apscpcr2018@gmail.com కు తెలిపితే చట్ట ప్రకార చర్యలతో పాటు, క్రిమినల్ చర్యలకు సిఫారసులు చేయనున్నట్లు సీతారాం పేర్కొన్నారు.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్)లో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్‌టిఎల్ వివిధ కార్యక్రమాలను నిర్వహించింది. కరపత్రాల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు బ్రీఫింగ్, ఎన్ఎస్‌టిఎల్ ఉద్యోగులకు, రామనాథ్ సెకండరీ స్కూల్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించింది. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపులో దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు మార్గనిర్దేశం చేశారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

వాల్తేరు డివిజన్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. డివిజన్‌లో విజిలెన్స్‌కు సంబంధించిన పలు అంశాలను ప్రచారం చేసేందుకు వ్యాసరచన, డిబేట్‌లు, సెమినార్‌లు, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం దొండపర్తిలోని డిఆర్ఎం కార్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో విజిలెన్స్ సదస్సు నిర్వహించి అభిప్రాయాలు, సూచనలు పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఒఎస్‌డి ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ అధ్యక్షత వహించిన సెమినార్‌లో రంజన్ మొహంతి, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, ఇతర శాఖల అధికారులుపాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం సోమవారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. నగర ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియపరచవచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని



కప్పరాడలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి రజని

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. ఆదివారం జివిఎంసి 92వ వార్డు గోపాలపట్నం రైతుబజార్ దరి వుడా కాలనీలో రూ.5.50కోట్లతో అభివృద్ధి చేసిన 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా పేదల వద్దకే స్పెషలిస్ట్ వైద్యసేవలు అందుతున్నాయన్నారు. టిడిపి నేత లోకేష్ వైద్య ఆరోగ్య శాఖపై అవగాహన లేని ట్వీట్లు చేస్తున్నారని ఆరోపించారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వైద్యఆరోగ్యశాఖలో ఎటువంటి సేవలు అందయో అందరికీ తెలుసన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని అనారోగ్యం పాల్జేసిన ఘనత చంద్రబాబుదేనని మండిపడ్డారు. కార్యక్రమంలో విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, డిప్యూటీ మేయర్ జియాని శ్రీధర్, వైసిపి పరిశీలకులు ఎస్ఎ రహమాన్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైసీపీ మహిళా నేత పేడాడ రమణి కుమారి, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ఆడారి శ్రీను, బద్రీనాథ్, వైసిపి వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, నమ్మి శ్రీను, జి అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకష్ణ, మార్కెటింగ్ డైరెక్టర్ ఆల్ఫాకృష్ణ, ప్రసాద్ రెడ్డి, బండారు వరలక్ష్మి పాల్గొన్నారు.

సీతమ్మధార :జివిఎంసి 47వ వార్డు కప్పరాడలో రూ.1.25కోట్లతో నిర్మించిన యుపిహెచ్‌సి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని, 89వ వార్డు యల్లపు వానిపాలెం -1 (చంద్రనగర్)లో రూ . 1.76.కోట్లతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించాలని సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.పది లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, చోడవరం ఇన్‌ఛార్జి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, డిఎంహెచ్ఒ డాక్టర్ పి జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆనంద్ మార్గ్ చిల్డ్రన్స్ హోం, మెడికవర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ చిల్డ్రన్‌హోం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మంది రోగులకు ఇసిజి, బిసి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికవర్ వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్ రోగుల పరీక్షించి, మందులు అందజేసారు. అనంతరం 50 శాతం రాయితీతో మెడికవర్ మెడికల్ కార్డులు అందరికీ పంపిణీ చేసారు. ఆశ్రమ నిర్వాహకులు ఆచార్య సౌమ్యానంద అవధూత, ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ ఎర్రి నాయుడు, సిబ్బంది చిట్టమ్మ, సౌభాగ్య, హేమ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదును ఆర్‌డిఒ పరిశీలన



బిఎల్‌ఒలకు సూచనలు చేస్తున్న ఆర్‌డిఒ భాస్కరరెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం: స్పెషల్‌డ్రైవ్‌లో పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను మధురవాడ పరిసర ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ భాస్కరరెడ్డి సందర్శించి, పరిశీలించారు. బిఎల్‌ఒల ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదు, తొలగింపులు, ఓటరు జాబితాపరిశీలన ప్రక్రియను చేపట్టారు. ఓటర్ల నమోదుపై బిఎల్‌ఒలకు ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి తగు సూచనలు చేశారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 17267 కాకినాడ-విశాఖపట్నం మెము స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ మెము ప్రత్యేక రైళ్లను నవంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు రద్దు చేశారు. 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ లను నవంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేశారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించండి

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్



ఆనందపురం పోలీసులకు సూచనలు చేస్తున్న సిపి

ప్రజాశక్తి -ఆనందపురం / పెందుర్తి : పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. ఆదివారం అనందపురం, పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది పనితీరు సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌ల పరిసరాలను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్న పలు కేసుల వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీసి,అవి పెండింగ్‌లో ఉండడానికి కారణాలను ప్రశ్నించారు. ఆయా కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై పూర్తి నిఘా ఉంచాలని, మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా దిశ యాప్‌పై మరింత అవగాహన పెంచాలన్నారు. ఎన్‌డిపిఎస్‌లో నమోదైన కేసులు, పలుమార్లు అరెస్టయిన పెడ్లర్లపై పిడి యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకుంటున్న చర్యలు, యాక్సిడెంట్ ప్రోన్ జోన్ల సంఖ్య, అక్కడ తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలు, ట్రాఫిక్ సిబ్బంది పనితీరు సమీక్షించారు. ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలని, బ్లాకోట్స్, ట్రాకోట్స్ పనితీరు సమీక్షించి, రద్దీ సమయాలలో విజిబుల్‌గా ఉండాలని, నిత్యం రద్దీ ప్రాంతాలలో సుప్రా వెహికల్‌తో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను ప్రదర్శించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సమిష్టిగా పార్కులో పరిశుభ్రతా పనులు



పార్కును పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎడి కాలనీవాసులు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు కృష్ణరాయపురం దరి పార్క్‌ను ఎన్ఎడి కాలనీవాసులు ఆదివారం సమిష్టిగా పరిశుభ్రం చేశారు ఈ సందర్భంగా ఎన్ఎడి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.టి.మూర్తి మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాలనీ పరిసరాలను వారానికి ఒక్కసారైనా కాలనీవాసులంతా సమిష్టిగా పరిశుభ్రం చేసుకోవాలని, భావితరాలకు ఈ అలవాటును అలవరచాలని సూచించారు. ఎవరో వస్తారని చూడకుండా మన పనిని మనం చేసుకోవడం ఎంతో మంచిదన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రేవంత్‌కు స్వర్ణం



కరాటే పోటీలో విజేతగా నిలిచిన రేవంత్

ప్రజాశక్తి -ఆనందపురం: విశాఖపట్నం అక్కయ్యపాలెంలో అబ్దుల్‌కలాం ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్‌కుమార్ ఖాతా, కుమతి రెండు విభాగాల్లో బంగారు పతకాలను సాధించాడు. విక్టరీ షఉటో ఖాన్ కరాటే అకాడమీ కోచ్ టి.సాయికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు పతకాలు సాధిస్తున్నారు. రేవంత్‌కు రెండు బంగారు పతకాలు రావడంపై అతని తల్లిదండ్రులు కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు కోచ్ సాయికుమార్ శిక్షణలో పాల్గొన్న ప్రతి పోటీలోనూ రేవంత్ పతకాలను సాధించడంపై అతని తండ్రి ఆర్మీ ఉద్యోగి రాజశేఖర్ అద్భుతమన్నారు

సేవా పీఠం ప్రారంభం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఆదివారం ధర్మశాస్త సేవా పీఠాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. సేవాపీఠం మేడపై అయ్యప్ప స్వామి ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. సేవా పీఠం ద్వారా అయ్యప్పదీక్షలో ఉన్న భక్తులను నిత్యం అన్నదానాన్ని కొనసాగిస్తారు. సేవా పీఠం ప్రారంభోత్సవం సందర్భంగా ఐదు వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు స్థానిక సర్పంచ్ సన్యాసమ్మ,. స్థానిక నాయకులు సత్యనారాయణ, నారాయణరావు, అప్పలనాయుడు వెంకటరావు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామీణ ప్రాంతాలలో నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆనందపురం పోలీస్‌స్టేషన్ క్రైమ్ ఎస్ఐ మన్మథరావు సూచించారు. ఆదివారం బోని గ్రామంలో నేరాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామాలకు వచ్చే అపరిచిత, కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు చైన్ స్నాచింగ్‌కు ఆస్కారం లేకుండా వీలైనంత మేరకు బంగారు ఆభరణాలు వేసుకోకపోవడం మంచిదన్నారు.

రౌడీలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- సీతమ్మధార: తగాదాల్లో తలదూర్చకుండా క్రమశిక్షణతో మెలగాలని రౌడీలకు నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయ్‌కుమార్ సూచించారు ఆదివారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల్లో ఉన్నవారు, రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలని, సెటిల్మెంట్ గొడవల్లో తగాదాల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -మధురవాడ : సిఎన్ఎపిఎస్, ఐఎస్‌సిఒ, ఐఎస్‌కెఒ, ఆర్ఒఎం, ఐఎస్ఇఒ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో అర్హత సాధించి, అత్యున్నత స్థానాలకు చేరుకున్న నారాయణ విద్యాసంస్థల విద్యార్థులను సంస్థ ఎజిఎం రాజకుమార్ అబినందించారు. ఈ సందర్భంగా పోటీపరీక్షలకు అవసరమైన సన్నద్ధతను, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారు రాణించేలా నారాయణ విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని, తద్వారా ఎందరో విద్యార్థులు అర్హత సాధిస్తున్నారన్నారు. ఆర్ఐ రఘు, హెచ్ఎం లలిత, పర్యవేక్షకులు ప్రతాప్, వాణి, ఉష, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

7న బోనిలో రైతు భరోసా పంపిణీ

ప్రజాశక్తి -అనందపురం: జిల్లాస్థాయిలో వైఎస్ఆర్ రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 7న బోని గ్రామంలో నిర్వహించనున్నట్లు భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్ తెలిపారు. ఐదో ఏట రెండోవిడత రైతు భరోసాను సత్యసాయి జిల్లాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. జిల్లాస్థాయిలో ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, జిల్లాలో 28,449 రైతులకు రూ.11.82 కోట్ల రైతు భరోసా, పిఎం కిసాన్ రెండవ విడత సాయం చెక్కును అందజేస్తారన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి- ఆరిలోవ :తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలతో టిడిపి వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో వార్డు పరిధి నెహ్రూనగర్, రాజేంద్రనగర్, రాజీవ్‌నగర్ శ్రీలీలాసుందరయ్య నగర్, కనకదుర్గా నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో బిఎల్‌ఒల సమక్షంలో ఓటరు జాబితాలను పరిశీలించారు. ఇంటింటికి వెళ్ళి ఓటరు జాబితాలో దొర్లిన తప్పులను బిఎల్‌ఒల దృష్టికి తీసుకు వెళ్ళారు.కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆదివారం ఇరాన్ వ్యవసాయ మంత్రి సలహాదారు డాక్టర్ పరిబోర్జ్ అబ్బాసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఎఇఒ డి.భ్రమరాంబ, పర్యవేక్షకులు కనకరాజు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వదించగా అధికారులు స్వామి తీర్థప్రసాదాలు అందించారు.

గోపూజలు ప్రారంభం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో గోపూజలను ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ఆదివారం ప్రారంభించారు. గోశాల పక్కనేప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి, ఎనిమిది మేలు జాతి గోవులను భక్తులు పూజించుకునే వెసులుబాటు కల్పించారు ముందుగా ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజు, దొడ్డి రమణ టికెట్ కొనుగోలు చేసి గోపూజలు చేశారు. గోవుల దాణాకు విరాళమిచ్చారు. సింహాచలం గోశాలలో 250పైగా గోవులు ఉన్నాయని, వాటి దాణాకు భక్తులు విరాళాలు ఇవ్వవచ్చని వారు సూచించారు.

వైభవంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణపుష్పార్చనలో దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి దంపతులు పాల్గొన్నారు.

పాలస్తీనాలో శాంతి స్థాపన ఐరాస బాధ్యత

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం, దాడులపై పలువురి ఖండన



సెమినార్‌లో పాల్గొన్న ఎంవివిఎస్.శర్మ, ఇతర ప్రముఖులు

ప్రజాశక్తి-సీతమ్మధార :పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిలుపుదల చేయించి, శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత ఐక్యరాజ్యసమితిపై ఉందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. ఆదివారం రేసపువానిపాలెం డాక్టర్ ఎల్‌బి కాలేజీ గాంధీసెంటర్ సమావేశ మందిరంలో బివి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియస్ ఫ్రీడమ్, వైజాగ్ ఎన్‌జిఓ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి-ఐక్యరాజ్యసమితి పాత్ర' అంశంపై సెమినార్ నిర్వహించారు. ముందుగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు జరిపారు. ఇజ్రాయేల్ దాడిలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సదస్సులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఎంవివిఎస్.శర్మ, దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య శ్రీసుధ, కన్సర్న్ ట్రస్ట్ ఇండియా చైర్మన్ డాక్టర్ పికె.జోష్, ప్రజ్ఞాన్ కుమార్ తదితర వక్తలు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయేల్ దాడిని ఖండించారు. ప్రపంచ శాంతి స్థాపనకు ఐక్యరాజ్య సమితి తక్షణ చొరవ చూపాలని కోరారు. ఇజ్రాయేల్ దాడిలో ఇప్పటికే ఏడువేల మంది మహిళలు, పసిపిల్లలు మృత్యువాత పడ్డారన్నారు. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి విరుద్ధంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తూ దాడులు చేస్తున్నా సామ్రాజ్య వాద దేశాలు దీనిని సమర్థించడం శోచనీయమన్నారు. తక్షణమే యుద్ధాన్ని ఆపి శాంతికి కట్టుబడి ఉండేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి చేయాలని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి తీర్మానంలో దేశ అలీన విధానానికి వ్యతిరేకంగా భారతదేశం తటస్థంగా ఉండడం శోచనీయ మన్నారు. తీవ్ర వాదాన్ని, ఉగ్రవాదాన్ని, మత మౌఢ్యాన్ని అన్ని దేశాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని తీర్మానించారు. సమావేశంలో డాక్టర్ గౌరీశంకర్, చాట్ల బాబూరావు, హుస్సేన్, ప్రభు, అనురాధ, సురేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

బాక్సింగ్ పతక విజేతలకు వెంకటరెడ్డి అభినందన



బాక్సింగ్ పతక విజేతలతో కాయల వెంకటరెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార: క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలు, ఉజ్వల భవిష్యత్‌ను పొందవచ్చునిఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుచ ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం సీతమ్మధారలోని తన కార్యాలయంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రా తరపున పాల్గొని పతకాలు సాధించి, రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులను అభినందించారు.

ఢిల్లీలో గతనెల 27నుంచి 30 వరకు బిఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్, సీనియర్స్ విభాగాల్లో ఆంధ్రా బాక్సింగ్ అసోసియేషన్ క్రీడాకారులు 13బంగారు, 12 రజతం, ఏడు కాంస్య పతకాలను సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్‌లు, అసోసియేషన్ మెంబర్లు కాయల వెంకటరెడ్డిని కలవగా అభినందించారు. కార్యక్రమంలో కెవిఆర్ ఎస్టేట్స్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంఎస్ఎస్. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ అమ్మోరు, కోచ్‌లు, విశాఖ పోర్టు ట్రస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ గుర్ల చందు, మెడికల్ చీఫ్ సునీల్ క్రీడాకారులు పాల్గొన్నారు

కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ వార్షికోత్సవం



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -తగరపువలస :కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ వార్షికోత్సవాన్ని ఒకటోవార్డు గాంధీబొమ్మ సమీపంలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు ముఖ్య అతిథిగా పాల్గొని అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. స్థానిక బిఏఓ కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, నీలాపు సూర్యనారాయణ, జెఎసి నాయకులు నారాయణరావు, రమణ, టి సూర్యప్రకాష్, గోవింద్, సత్యారావు, వెంకటరావు పాల్గొన్నారు

నేవీ మారథాన్‌లో కస్తూర్బా విద్యార్థినులు



నేవీ మారథాన్‌లో కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : వైజాగ్ వాలంటీర్స్ ఆధ్వర్యాన విశాఖ నగరంలో ఆదివారం జరిగిన 2కె, 5కె రన్‌లో స్థానిక కెజిబివి విద్యార్థినులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ గంగా కుమారి తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి శ్రీనివాసరావు, జిసిడిఒ బేగం పాల్గొన్నారు.

ఆనందపురం: విశాఖపట్నం నేవీ మారథాన్‌లో పాల్గొని మండలంలోని నేలతేరు కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిని ఎపిడి బి.శ్రీనివాసరావు, జిసిడిఒ డాక్టర్ కాలేషాబేగం అభినందించారు. కార్యక్రమంలో కేజీబీ అధికారి చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు

1,2 తేదీల్లో ఉక్కునగరంలో చిల్డ్రన్స్ ఫెస్టివల్



పోస్టర్ ఆవిష్కరణలో రమాప్రభ, తదితరులు

ప్రజాశక్తి-ఉక్కునగరం :బాల బాలికల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగానే వచ్చేనెల 1,2 తేదీల్లో ఉక్కునగరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళాక్షేత్రంలో చిల్డ్రన్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే పలు కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విసిసి వ్యవస్థాపకులు కొరెడ్ల రమాప్రభతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగారమాప్రభ మాట్లాడుతూ పిల్లలలో చదువులు పట్ల ఉన్న మానసిక ఒత్తిడిని తొలగించేందుకు విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఏర్పడిందన్నారు. ఏటా ఆటల పోటీలతోపాటు విజ్ఞానం, వినోదంతో కూడిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1,2 తేదీల్లో ఉక్కునగరంలో నిర్వహించే చిల్డ్రన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనదలచిన వారు ముందుగా తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఐద్వా సభ్యులు విజయలక్ష్మి, సుమలత, పికెఎం లక్ష్మి, రూప సారిపూరి, శ్రీ గౌరి, హిమబిందు, పద్మావతి, అంజలి, సిడబ్ల్యుసి 2 సెక్రటరీ సిహెచ్‌వి. సత్యనారాయణ, స్టీల్ క్లబ్ సెక్రటరీ నారాయణ దొర, లయన్స్ క్లబ్ సభ్యులు కెవి.ప్రసాద్, సత్య సాయి సర్వీస్ కోఆర్డినేటర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

'పేదల సేవ కోసం' యువజన సంఘం ఏర్పాటు



జగదీష్‌ను సన్మానిస్తున్న మంగరాజు, తదితరులు.

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదల సేవ కోసమే యువజన సంఘం ఏర్పాటు చేసినట్లు, సంఘం జిల్లా అధ్యక్షులు పూసర్ల జగదీష్ అన్నారు. ఆదివారం గాజువాకలో సంఘ సభ్యుల ప్రమాణ స్వీకారం. అనంతరం ప్రమాణ స్వీకారం అనంతరం అభినందన సత్కార సభ జరిగింది. భవిష్యత్తులో సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి హరినాథ్, వైసిపి విశాఖ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కులుకూరి మంగరాజు, విశాఖ జిల్లా అధ్యక్షులు కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మహేష్, గాజువాక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుంపును రఘునాథ గుప్తా, గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు..

8న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఇ ఫ్లోరా తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐసిఐసిఐ బ్యాంక్, ఫ్రైసీ గ్లోబల్ టెక్నాలజీ, ఆస్ట్రోటెక్ స్టీల్స్, బిఎస్ఎం, వెస్ట్ సైడ్, డైకిన్ ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొని, రిలేషన్‌షిప్ మేనేజర్, రియాక్ట్ నేటివ్ డెవలపర్, టెక్నీషియన్, ఎగ్జిక్యూటివ్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. బిఎస్‌సి, బిసిఎ, బికాం, బిబిఎ, బిటెక్, ఎంసిఎ, డిప్లమో, ఐటిఐ ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణులై, 29ఏళ్ల వయస్సులోపు వారు ఏ కాలేజీకి చెందిన వారైనా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడులో పనిచేయాల్సి ఉంటుందని, 340 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలునిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.1.50 లక్షల నుంచి 3.30 లక్షల వరకు చెల్లిస్తారన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు రెజ్యూమ్‌తోపాటు ఆధార్‌కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫొటోస్, విద్యార్హతల సర్టిఫికెట్‌లతో ఆదర్శ్ కళాశాల డిజి సెమినార్ హాల్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ తెలిపారు.

8న విద్యాసంస్థల బంద్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్ర రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న ౹ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, విద్యార్థి, యువజన సంఘాల జెఎసి పిలుపు మేరకు ఈ నెల 8న తలపెట్టిన విద్యాసంస్థల రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు కోరారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ భీమిలి డివిజన్ కమిటీల ఆధ్వర్యాన బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు, నినాదంతో ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా మహోద్యమంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్థాపించారని, నేడు దాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వెయ్యి రోజులుగాకార్మికులు, విద్యార్థి, యువజనులు, అన్నివర్గాల ప్రజలు ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. దీనికి నిరసనగా 8న జరగనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు తేజశ్రీ, సూరిబాబు, వాసు, సూర్య, డివైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన...

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఈ నెల 8న తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన స్థానిక బిసి కళాశాల వసతి గృహం వద్ద ఆదివారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షులు శ్రీను, నాయకులు జీవన్, చరణ్, శివరామకృష్ణ పాల్గొన్నారు

దళిత యువకునిపై దాడి హేయం



ఆరిలోవలో ఎమ్మెల్యే వెలగపూడి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్‌టిఆర్ జిల్లా కంచర్లలో కాండూరి శ్యామ్ కుమార్ అనే దళిత యువకుడిపై దాడి ఘటనను ఖండిస్తూ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో ఆదివారం పెదగదిలి కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నిరసన చేపట్టింది.. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవిందు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు, 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, ముగడ రాజారావు, పొత్రకండ ధర్మారావు పాల్గొన్నారు.

తగరపువలస: వైసిపి పాలనలో దళితులపై యథేచ్ఛగా సాగుతున్న దాడులను నిరసిస్తూ టిడిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పతివాడ రాంబాబు ఆధ్వర్యాన ఆదివారం స్థానిక జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు.

పార్టీ నియోజక వర్గ ఇంఛార్జ్ కోరాడ రాజాబాబు మాట్లాడుతూ, వైసిపి పాలనలో దళితులకు రక్షణ కొరవడిందని, నిరాటంకంగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి సూరిబాబు, బడిగింటి నీలకంఠం, చిలకా నరసింగరావు, నరవ రామారావు, టి అప్పల రాజు, ఎం వెంకట రావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. కంచికచెర్లలో దళిత యువకునిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆదివారం భీమ్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. జగన్ పాలనలో దళితులపై వరుసగా ఆకృత్యాలు జరుగుతున్నాయన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- లేకుంటే డిసెంబర్ నుంచి సమ్మె
- యూనియన్ నేత నాగశేషు

ప్రజాశక్తి- అనకాపల్లి

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే డిసెంబర్ నుంచి సమ్మెబాట పట్టాల్సి ఉంటుందని ఎపి అంగన్వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు హెచ్చరించారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం అంగన్వాడీ సెక్టార్ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేసి, ఒకే యాప్ ద్వారా సెంటర్ నిర్వాహణ జరిగేలా చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్ గుర్తించాలని, అంగన్వాడీ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించి వేతనంలో సగం పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. లబ్దిదారులకు నాణ్యమైన సరుకులు సకాలంలో సరఫరా చేయాలని కోరారు. ఈ డిమాండ్లపై దశల వారీగా అనేక పోరాటాలు చేసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు, ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు సానుకూలంగా పరిశీలించి పరిష్కారం చేయాలని, లేని పక్షంలో డిసెంబరు మొదటి వారంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు దుర్గారాణి, కోశాధికారి వివి రమణమ్మ, సుబ్బలక్ష్మి, రమణి, రామలక్ష్మి, తనూజ,కాసులమ్మ, సత్యవేణి, మహాలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నేత నాగశేషు


ఉమామహేశ్వరరావును పరామర్శిస్తున్న సిహెచ్.నర్సింగరావు

సిఐటియు నేత ఉమామహేశ్వరరావుకు సిహెచ్.నర్సింగరావు పరామర్శ

ప్రజాశక్తి- విశాఖపట్నం

శస్త్ర చికిత్స చేయించుకొని విశాఖపట్నం కూర్మన్నపాలెంలో విశ్రాంతి తీసుకుంటున్న సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావును సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఆదివారం పరామర్శించారు. ఉమామహేశ్వరరావు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


గణేష్‌ను సన్మానించిన గ్రామస్తులు

ఉత్తమ చిత్రకారుడు గణేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డేడ సూర్యనారాయణ చోడవరంలో స్థాపించిన చిత్రకళా నిలయంలో జరిగిన ఆల్ ఇండియా చిత్రలేఖనం పోటీలో ఉత్తమ చిత్రకారునిగా అవార్డు సాధించిన మునగపాక గ్రామానికి చెందిన చిన్ని గణేష్‌ను పలువురు అభినందించారు. ఈ పోటీల్లో గణేష్ బుద్ధుడి చిత్రాన్ని తన కుంచె ద్వారా గీచి అద్భుత ప్రతిభను కనబరిచి ఉత్తమ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు చోడవరం చిత్రకళ నిలయంలో ఫారెస్ట్ ఆఫీసర్ బి రామ నరేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నగణేష్‌ను గ్రామస్తులు ఆదివారం సత్కరించారు. చిన్ని గణేష్ చిన్నతనం నుండి చిత్రలేఖనం పట్ల ఎక్కువ మక్కువ చూపించేవాడు. గ్రామంలో కూడా వివిధ రకాలైన చిత్రాలను గీచి పలువురు మన్ననలను పొందిన చిన్ని గణేష్ అదే స్ఫూర్తితో ఆలిండియా స్థాయిలో తన సత్తాను చాటాడు. గత ఆగస్టు నెలలో చెన్నైలోని టీ నగర్ "శ్రీ దర్శిని కలయికుడిని" సంస్థ ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా చిత్రలేఖనం పోటీలలో కూడా ఉత్తమ చిత్రకారుడుగా చెన్నై శాసనసభ్యులు ఉదయనిధి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మరిన్ని అవార్డులు సొంతం చేసుకుని గ్రామానికి పేరు తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి - పరవాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో చిత్త శుద్ధితో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని భరణికం పంచాయతీలో జగనన్న మా భవిష్యత్తు సంక్షేమ యాత్ర, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ, అర్హులై ఉండి పథకాలు అందలేని వారికి అందించడమే లక్ష్యంగా ఈ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.సన్యాసిరాజు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, సర్పంచ్‌లు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కృష్ణవేణి, కుంద్రపు వరలక్ష్మి సీతారామయ్య, బండారు కల్యన రాజ్ శేఖర్, భరిణకం వైస్ సర్పంచ్ కె.కనకరాజు, వైసిపి నాయకులు పైల అప్పలనాయుడు, దెక్క శ్రీనివాసరావు, కంచిపాటి భాస్కర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ఘనంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం వన్ టౌన్‌లోని శ్రీ వివేకానంద అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, గత 16 ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమానికి ఫెడరేషన్ అహర్నిశలు శ్రమిస్తూ వచ్చిందని చెప్పారు. అన్ని ప్రాంతాల్లోనూ జర్నలిస్టులకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు, బీమా, వైద్యం, ఇతర సంక్షేమ పథకాల అమలుకు పెద్ద ఎత్తున కృషి చేసిందని చెప్పారు. మున్ముందు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతి జర్నలిస్టుకు చేయూతనిస్తూ వారి కష్టకాలంలో భాగస్వామ్యం కానుందని తెలియజేశారు. ఫెడరేషన్ శ్రమ ఫలితంగా జర్నలిస్టులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ క్యాబినెట్‌లో తీర్మానం చేసిందని చెప్పారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు వస్త్రాలు, స్కూల్ పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం మేరకు జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఇతర నేతలు కృష్ణవేణి, భగవాన్, రవిశంకర్, నగేష్, ఆశ్రమ వ్యవస్థాపకులు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఉడ్డుపేట జీవీఎంసీ పాఠశాలలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సతీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ అనకాపల్లి అధ్యక్ష కార్యదర్శులు బి కొండలరావు, రామకృష్ణ, బాషా, బి వెంకటేష్, శేఖర్, గణేష్, మోహన్, రామారావు, నటరాజ్, రాజా, నాయుడు, బుజ్జి, ఎంవిఆర్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు, సంజు బాబు టీం తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లిలో మొక్కలు నాటుతున్న ముత్యాల సతీష్


వాలీబాల్ కిట్లు అందజేస్తున్న రమణాజీ

జనసేన ఆధ్వర్యాన 'నా ఓటు-నా హక్కు'

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని లక్కవరం గ్రామంలో జనసేన నియోజకవర్గ నాయకులు జెర్రిపోతుల రమణాజీ ఆధ్వర్యంలో ఆదివారం నా ఓటు నా హక్కు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. ఐదేళ్లపాటు మనల్ని పాలించే వారిని నిర్ణయించే ఓటు అనే ఆయుధాన్ని తప్పుగా వినియోగిస్తే నష్టపోయేది ప్రజలేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న యువతకులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సిరిపురం రమేష్, నందవరపు రమాదేవి, నరసింహమూర్తి, నాయుడు, టిడిపి నాయకులు నాగులపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆదివారం పున:ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏపీఐడబ్ల్యుఎ చైర్మన్ అధ్యక్షులు దంతులూరి దిలీప్ కుమార్, వార్డ్ కార్పొరేటర్ మందపాటి సునీత, ఫాదర్ జై కుమార్, ప్రెసిడెంట్ ఏ జె మోహన్ దాస్, సెక్రెటరీ కేజే జోసెఫ్, ట్రెజరర్ శేషు కుమార్, వైసిపి అనకాపల్లి జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి, ఎంపీపీ గొర్లె సూరిబాబు, దంతులూరి కళ్యాణ చక్రవర్తి, గ్రేపూరి రాజు, జార్జ్ విల్సన్, డేనీ, కోన ఉమా, లంక సత్తిబాబు, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్ పాల్గొన్నారు.


చర్చిని పున:ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు : గంటా


మాట్లాడుతున్న మాజీ గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలో పలు ప్రైవేటు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం దిబ్బిడి గ్రామంలో తులసి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి టిడిపి మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, రానున్న ఎన్నికల్లో వైసిపి పాలనకు చరమగీతం పాడాలని కోరారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను మళ్లీ సరిదిద్దేందుకు చంద్రబాబు నాయకత్వం అవసరమని చెప్పారు. మీడియా సమావేశం అనంతరం మాజీ ఎంపీటీసీ గున్నబత్తుల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ముమ్మిన నాగరాజు, పాల సంఘం అధ్యక్షులు ముమ్మిన సూర్యనారాయణ, పార్టీ అధ్యక్షులు పెదిరెడ్ల రాజు, ప్రధాన కార్యదర్శి సేనాపతి మణికంఠ, తెలుగు యువత కార్యకర్తలు గంటాకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, కోరుకొండ రవికుమార్, ఎంపీటీసీ కంచిపాటి శ్రీనివాసరావు, కోట సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీ శంకర్, జనసేన నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



హెరిటేజ్ సంక్షేమ పథకాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'హెరిటేజ్‌తో పాడి రైతులకు అధిక లాభాలు'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీతో పాల రైతులు అధిక లాభాలు వస్తున్నట్లు డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు అన్నారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో శనివారం రాత్రి పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పాల ఉత్పత్తికి రైతులు చేపట్టవలసిన పశుపోషణ తదితర విషయాలను వివరించారు. హెరిటేజ్ డెయిరీలో పాలు పోసిన రైతుల పాడి పశువులకు రూ.50కు సాధారణ కృత్రిమ గర్భధారణ, ఆడపెయ్య పుట్టుటకు రూ.500కే కృత్రిమ గర్భధారణ అందిస్తున్నట్లు చెప్పారు. డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ అన్ని డెయిరీల కంటే హెరిటేజ్ ఎక్కువ రేటు చెల్లిస్తుందన్నారు. పలు సంక్షేమ పథకాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పి.శ్రీను కే.రమణాజీ, బి.జగ్గారావు, బి.కుమార్, బి.శివ, బి.రవాణాజీ పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమ గీతం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలనకు చరమ గీతం పాడటానికి జన సైనికులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, పాలిపిని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెడుతున్నారన్నారు. బస్ చార్జీలు, విద్యుత్ చార్జీలు, నిత్యవసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి, అరెస్టులు చేసి భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మొల్లేటి ఆనంద్, కె.చంద్రమోహన్, పాలిపిని రాము, ఆడారి శ్రీకాంత్, చొప్పా శ్రీను, ప్రభాస్ శ్రీను, పోలమరశెట్టి అప్పలనాయుడు, పిట్ట వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో నరిశింగబిల్లి హైస్కూల్‌లో 2007-08 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పరమటమ్మలోవలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పోటీలు నిర్వహించి అందరూ కలిసి అడి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, అప్పారావు, లక్ష్మి పాల్గొన్నారు.

సుపథ సంస్థ కృషి అభినందనీయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : విద్యార్థులలో సంస్కృతి సాంప్రదాయాలు, మానవతా విలువలు పెంపొందించడానికి సుపథ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు అన్నారు. సుపథ స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకులు యువిఎన్ రాజు ఆధ్వర్యంలో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో 30 పాఠశాలల నుండి 391 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, వేద పఠనం, శ్రీకృష్ణ చరితామృతం, శ్రీమద్రామాయణం, ప్రహేలిక (క్విజ్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కిలపర్తి భాస్కరరావు, యువిఎన్ రాజు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కే శ్రీనివాస్, బివి దేవుళ్ళు, డి దేముడు, వైబివి ఉదయ్ కుమార్, జి చిన్నమనాయుడు, సిహెచ్ సూర్యనారాయణ, బి లోవరాజు, నాగకరుణ, వై. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న భాస్కరరావు తదితరులు

అనుమతి లేకుండా

బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకంపై కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి -అనకాపల్లి

అనుమతి లేకుండా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ, విక్రయాల లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా అమ్మాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలను నిలువరించేందుకు వీలుగా నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మైనర్లను బాణసంచా తయారీ, విక్రయ పనుల్లో ఉంచుకోరాదన్నారు. లైసెన్స్ కలిగి ఉన్న విక్రయిదారులు లైసెన్స్ లేని వారికి విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్ దారులదే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, హాస్పటల్స్‌కు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలని, ఏమాత్రం నిబంధనలు అతిక్రమించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీపావళి రోజున ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో ఫైర్ స్టేషన్‌కు 101, పోలీస్ డయల్ 100/112 లేదా, పోలీస్ వాట్సాప్ నెంబర్ 94409 04229 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

గ్రామాల్లో 'భవిషత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని పిసినికాడ పంచాయతీ, బసవ రామ తారక కాలనీలో ఆదివారం టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు, మహిళలుకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బిఆర్టి కాలనీ వార్డు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఇరువాడలో శనివారం రాత్రి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ప్రచారం చేశారు. గ్రామ పురవీధులలో తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో జరుగుతున్న దౌర్జన్యాలు అక్రమ అరెస్టులు వాటిని తీవ్రంగా ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిడి శివ అప్పారావు, పెయ్యలా గిరి, కుందిరి అప్పలరాజు, నాగల శ్రీను, పిల్లా శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి రెండోవార్డు రాయిపాలెంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టో బ్రోచర్‌ను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పార్టీ నాయకులు అందజేశారు.అనంతరం ప్రజా వేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా కోరాడ రాజ బాబు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడడం ఖాయమని, టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టిడిపి రెండో వార్డు అధ్యక్షులు బడిగింటి నీలకంఠం, బి నూకరాజు, రవి, జోగ సన్యాసిరావు పాల్గొన్నారు



ఇంటింటా మేనిఫెస్టో బ్రోచర్లను ఇస్తున్న రాజబాబు

9న బస్సు యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి

ప్రజాశక్తి - కశింకోట

రాష్ట్ర మంత్రుల సామాజిక సాధికార యాత్ర అనకాపల్లి నియోజకవర్గంలో ఈ నెల 9వ తేదీన జివిఎంసి నిర్వహిస్తున్నారని, ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో మంత్రులు బూడి ముత్యాల నాయుడు, విడుదల రజిని, ఎంపీ డాక్టర్ బి వెంకట సత్యవతి, జిల్లాలో ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లివిల్లి బాబు రావు, పల్లా చిరంజీవి పాల్గొన్నారు.

అనకాపల్లి : ఈనెల తొమ్మిదో తేదీన అనకాపల్లిలో జరిగే సామాజిక సాధికారక యాత్రలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండేలా చూడాలని వైఎస్సార్సీపీ శ్రేణులకు ఆంధ్రప్రదేశ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ దంతులూరి కుమార్ సూచించారు. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు అధ్యక్షతన ఆదివారం దిలీప్ కుమార్ స్వగృహంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. తుమ్మపాల గ్రామం నుంచి 2000 మంది ఈ యాత్రకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, పీలా బుజ్జి, వైసిపి నాయకులు చంద్రశేఖర్, ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, వడ్డాది అశోక్, అన్నపూర్ణ బ్యాంక్ అధ్యక్షులు పిళ్ళా గాంధీ, కళ్యాణ్ చక్రవర్తి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-వడ్డాది : ఎపిటిఎఫ్ బుచ్చయ్యపేట మండల కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. వడ్డాది జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం ఎపిటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.శేషుకుమార్, సిహెచ్. మధుకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్ ఎ.ప్రసాదరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవరించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతి రాజు పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు యాప్‌ల గోల తగ్గించాలని, 117 జిఒను రద్దు చేసి పాఠశాలల విలీనం ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఎస్.దుర్గాప్రసాద్, బి.దేముడు బాబు, పి.అయ్యన్న, జిటికె.మూర్తి, నౌడు అప్పారావు, ఎం.రామ్మూర్తి, లక్ష్మి, సహణశీల, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి గంటాను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కశింకోట : విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును అనకాపల్లిలోని గంటా కార్యాలయంలో టిడిపి నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధిస్తుందని, ఇప్పటి నుండే పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. గంటాను కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, ఉలింగల రమేష్, జెర్రిపోతుల నూకునాయుడు, గొల్లవిల్లి ప్రవీణ్, నారిపల్లి ప్రసాద్, నైయినంశెట్టి రమణారావు ఉన్నారు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఇందులో పాల్గొన్న ఎఎమ్ఎఎల్ కళాశాల విశ్రాంతి ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అడవులు పెరగడం వల్ల వర్షాలు కురుస్తాయని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ కాలుష్యం నగరాలు పెరుగుతున్నాయని, విరివిగా చెట్లు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు మళ్ళ మురళి, బి వినోద్ కుమార్, కొణతాల పణిభూషణ శ్రీధర్, బి శేషసాయి, గంట్ల కృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

దళితులపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాచారాలు 6 వేలకు పైగా జరిగాయని, అటువంటి ప్రభుత్వానికి సామాజిక సాధికార యాత్ర చేసే నైతిక హక్కు లేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న సుధాకర్ కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు సస్పెండ్ చేసి, పిచ్చివాడిగా ముద్ర వేసి, పోలీసులతో నడిరోడ్డుపై కొట్టించి చనిపోయే విధంగా మానసికంగా వేధించి చంపేశారని మండిపడ్డారు. పెందుర్తి మండలంలో వైకాపాకు చెందిన నూతన నాయుడు అతని భార్య కలిసి దళిత యువకుడు పర్రి శ్రీకాంత్‌ను ఇనుప కడ్డీలతో కొట్టి శిరోముండన చేశారని, దీనిపై ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఆకు రౌడీల నుంచి ఆర్థిక నేరగాళ్ల వరకు అంతా వైసీపీలోనే ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మైలపల్లి పోతురాజు జిల్లా ఎస్సీ సెల్ కల్చరల్ అసోసియేషన్ సెక్రెటరీ పిట్ల సత్యనారాయణ (బాలు) పాల్గొన్నారు.

జనసేన భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : పల్లె పల్లెకు జనసేన కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు డిఎస్ నాయుడు పర్యవేక్షణలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మంగళాపురం గ్రామం నుండి ప్రారంభమైన ర్యాలీ వడ్డాది మీదుగా మల్లం మీదుగా 20 గ్రామాల్లో నిర్వహించి గున్నెముపూడి గ్రామం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తుమ్మపాల రమేష్, గుండు గణేష్, మాణిక్యం, దొండా సాయి, యడ్ల రామ్మూర్తి, అరుణ్, నాగేశ్వరరావు, విష్ణు, మహేష్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దమయంతి

విద్యార్థులకు కథలపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖ గ్రంథాలయం నందు నిర్వహించే చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమం విద్యార్థులకు గ్రంథాలయం అధికారిని పి.దమయంతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పిల్లలకు బామ్మ చెప్పిన బంగారు నీతి కథలు, అబద్ధం ఆడకు, నిజమైన స్నేహితుడు వంటి కథలు చదివించి నీతిని బోధించారు.మాస్ రీడింగ్‌తో స్వచ్ఛత, ఉచ్చారణ కలుగుతుందని తెలిపారు. ఈనెల 14 నుండి జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

రూ.6 వేల నగదు అందజేత

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో చినపాచిల కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం కలిగి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి సర్పంచ్ దాసరి సూర్యకుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు చేతుల మీదుగా కోఆపరేటివ్ ప్రతినిధులు నగదును అందజేశారు. మండలంలో చినపాచిల కోఆపరేటివ్ సొసైటీలో కవగుంట గ్రామానికి చెందిన రేంం పెదవెంకనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుమారుడు రేంం కృష్ణకు రూ 6000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, సచివాలయ కన్వీనర్ మాట్లాడుతూ దహన ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని కోపరేటివ్ సొసైటీ అందించడం జరిగిందన్నారు.



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 8వ వార్డుకు చెందిన వాలంటీర్ ముదుగు దేవయ్య బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి వై.ఎస్ . జగన్ మోహన్ రెడ్డి సహాయ నిధి నుంచి రూ.5లక్షల చెక్కును ఆదివారం ఎంఎల్ఏ ఉమాశంకర్ గణేష్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ ప్రెసిడెంట్ యాక శివప్రసాద్, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను

పలుచోట్ల వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -యస్.రాయవరం:ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని బిబిఆర్ ప్రజా వైద్యశాల వ్యవస్థాపకుడు, ప్రజా సేవకుడు ప్రముఖ వైద్యులు బి.బంగారయ్య అన్నారు. ఆదివారం అడ్డురోడ్డులో తన ప్రజా వైద్యశాలలో పేదలకు ఉచిత వైద్యంను అందించారు. సుమారు 150 మంది పేదలకు వివిధ రోగాలకు సంబంధించిన మందులను ఉచితంగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నాణ్యమైన కార్పొరేట్ వైద్యం గ్రామస్థాయిలో అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమన్నారు. తనకు అధికార పార్టీ సీటు కేటాయిస్తే నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా పేరుకు పోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

యస్.రాయవరం: మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారి చిట్టి తెలిపారు. రాష్ట్ర ఆప్కాప్ వైస్ చైర్మన్ మాతా



పరీక్షలు చేస్తున్న

గురున్నాథరావు, యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ ఆదారి పూరిజగన్నాద్ మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు.మెడికవర్ హాస్పటల్ బృందం 250 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు మజ్జి గణపతిరావు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలిపల్లి శ్రీను, ఎం.పి.టి.సి పేర్ల మాధవా, ఆంధ్ర మత్స్యకార జేఏసి రాష్ట్ర కార్యదర్శి పిక్కి కోదండరావు, కారే కృష్ణ, మైలిపల్లి జగ్గ, తాడి రమణ పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని రత్నంపేట శివారు గ్రామం వై.బి.పట్నం గ్రామానికి చెందిన చీడిపల్లి అర్జునరావు(45) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. చీడిపల్లి అర్జునరావుకు భార్య, పిల్లలు ఎవరూ లేకపోవడంతో మద్యానికి బానిసై ప్రతీ రోజు తాగుతూ పాఠశాల భవనం, గుడిలోను నిద్రించే వాడని, ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆ గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువుకు వెళ్లాడు. శనివారం కురిసిన వర్షానికి జారిపడి చెరువు లో మృతి చెందాడు. ఆదివారం చెరువులో మృతదేహాన్ని మృతుడి తమ్ముడు తాతబాబు చూసి రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాన్ షాప్‌లో చోరీ

ప్రజాశక్తి -యస్.రాయవరం:మండలంలో రేవుపోలవరం గ్రామంలో శనివారం రాత్రి పాన్ షాప్‌లో దొంగతనం జరిగినట్లు స్థానిక ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం...నక్కపల్లి మండలం దొండవక గ్రామానికి చెందిన కోడా బంగారాజు చేపల వేట చేసుకుంటూ జీవన సాగించేవారు. అతని భార్య కోడా దుర్గ మండలంలో రేవుపోలవరం గ్రామంలో తల్లి ఇంటి వద్ద సుమారు 6 సంవత్సరాల నుండి చిన్న పాన్ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి ఎప్పటిలాగే షాప్ మూసివేసి వెళ్లగా తెల్లవారి 3 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి షాప్ తలుపులు తెరిచి ఉందని తెలపటంతో హుటా హుటానా వెళ్లి చూశారు.లోపలకి వెళ్లి చూడగా షాప్ లో సామగ్రి దగ్ధమైంది.

కొద్దిపాటి వర్షానికే రోడ్డు జలమయం

ప్రజాశక్తి -రోలుగుంట:ఆరేళ్లుగా పూర్తి కాని రోడ్డు, చిన్నపాటి వర్షాలకే చెరువుల్లా తలపిస్తుంది రత్నం రోడ్డు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట ఆర్అండ్‌బి రోడ్డు నుండి ఎంకె.పట్నం మీదుగా బిబి.పట్నం, రత్నంపేట నుండి వడ్డిప వెళ్లే రోడ్డు గత టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైంది. అప్పట్లో ఆ రోడ్డునకు ఒక పరువు వేశారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక గతంలో రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడిని రద్దు చేశారు. 2020లో మళ్లీ ఆ రోడ్డునకు కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. మళ్లీ ప్రారంభించి ఒక పరువు వేసి కల్వర్టులు నిర్మాణం చేపట్టడానికి తారురోడ్డు వేయుటకు పిక్కను తరలించి బిబి.పట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో స్టాకు పాయింట్ చేశారు. ఇదిలా ఉండగా మళ్లీ ప్రతిపాదనలు చేసి 2కోట్ల 31లక్షల రూపాయలు నిధులు మంజూరు అయినట్లు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కురిసిన వర్షపు జల్లులకు గోతులలో నీరు చేరడంతో చెరువులను తలపిస్తుంది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



రోడ్డుపై గోతిలో చేరిన వర్షపు నీరు



వినతిపత్రం ఇస్తున్న వీసం రామకృష్ణ, నాయకులు

ప్రహరీ మంజూరుకు వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు చేయాలని ఎంపీ వెంకట సత్యవతికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీ నానాజీ వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఆమె నక్కపల్లి రావడంతో ప్రహరి గోడ లేకపోవడంతో కలుగు ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఓ వెంకట లక్ష్మమ్మ, ఎంఈఓ నరేష్, హెచ్ఎం రాణి లలిత, తెలుగు ఉపాధ్యాయులు ఎస్ వి ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు .



పరామర్శిస్తున్న అనిత

బాధితులకు అనిత పరామర్శ

ప్రజాశక్తి -యస్.రాయవరం:గత నెల 17న బస్సు బోల్తా పడిన ఘటనలో గాయపడిన కుటుంబాలను పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత పరామర్శించారు. ఆదివారం ఉదయం గుడివాడ శివారు కొత్తపోలవరం గ్రామంలో బాధిత కుటుంబాలను కలుసుకుని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గత నెల17న నెల్లూరు జిల్లా నాయుడుపేట వద్ద బస్సు రోడ్డు బోల్తా పడడంతో యాత్రీకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఆమె వెంట తెదేపా జిల్లా కార్యదర్శి కోన అప్పలరాజు, మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, కురందాసు శ్రీనువాస్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

ఎపిటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మాడుగుల :మాడుగుల మండలానికి సంబంధించి ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఎంకె వల్లాపురం పాఠశాలలో ఏపీటీఎఫ్ మాడుగుల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి వెంకటపతిరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షులుగా పిఎస్ ప్రకాష్, అధ్యక్షులుగా కే.బంగారయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్ ఎన్‌విడి సూర్యనారాయణ, ఈవీఎస్ అన్నపూర్ణ, ఎస్.జగన్‌మోహన్,ప్రసాద్, కార్యదర్శులుగా జగన్నాధరావు, శివాజీ, ఉష, బాలకృష్ణ నాయుడు, నాగేశ్వరరావు లను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మహాలక్ష్మి నాయుడు వ్యవహరించారు.

భవనానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - మాడుగుల: ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి మంత్రి బూడి ముత్యాల నాయుడు నిధులు మంజూరు చేశారు. ఆదివారం పోతనపూడి అగ్రహారం శివారు కొండయ్యపాలెం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు కొరుకొండ చలనం నాయుడు తెలిపారు. తమ కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని తారువలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లగందు మహాలక్ష్మీ నాయుడు, చిక్కాల అప్పారావు, రాజారామ్, శ్రీను, బుల్లబ్బాయి పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ జాబితాను పారదర్శకంగా రూపొందించే పనిలో ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా తహసీల్దార్ జానకమ్మ మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా శని, ఆదివారాలు మండల వ్యాప్తంగా 52 పోలింగ్ బూతుల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ రెండు కలిపి ఫారం 6కు 218, ఫారం 7కు 27, ఫారం8కు 44, 6 బికి 3కు దరఖాస్తులు వచ్చాయి.

గొలుగొండ:చీడిగుమ్మల పంచాయతీలో ఆదివారం జరిగిన ఓటరు వెరిఫికేషన్‌ను నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ నమోదు, ఓటర్ లిస్ట్‌ను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఉన్న డెత్ ఓటర్లను కొత్త ఓటరు లిస్ట్‌లో తొలగించలేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్డీవో దృష్టికి తీసుక ువెళ్లగా బిఎల్ఓలతో చర్చించి తొలగిస్తామని పేర్కొన్నారు.

నక్కపల్లి:నక్కపల్లిలో ఓటర్ల ప్రత్యేక క్యాంపెయిన్ కేంద్రాలను ఆదివారం ఈఆర్వో కెవి రామలక్ష్మి సందర్శించారు. బూత్ నెంబర్లు 209, 210, 211, 212లను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలు పక్కగా నిర్వహించాలని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు.

రోలుగుంట:చోడవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీలాగాంధీ ఆదివారం రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు వెరిఫికేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె 27, 28, 29 మూడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దార్ వరహాలు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



రోలుగుంటలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రమీలాగాంధీ

ముఖ్యమంత్రికి జర్నలిస్టుల వందనం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించనున్నట్లు ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రకటించిన నేపథ్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డికి విశాఖ జర్నలిస్టుల వందనం పేరుతో బీచ్‌రోడ్డులో ఆదివారం కృతజ్ఞతాపూర్వక ర్యాలీని నిర్వహించారు. సీ హారియర్ మ్యూజియం నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. ప్రజా సంకల్ప యాత్రలో హామీ ఇచ్చి, మేనిఫెస్టోలో పెట్టి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి నిర్ణయించడాన్ని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ గౌరవాధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి.జనార్ధన్, అధ్యక్షులు బి.రవికాంత్, ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.రామచంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు.

దాదాపు 2 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర ఆద్యంతం థాంక్యూ సిఎం సార్, జర్నలిస్టుల తరపున కృతజ్ఞతలు అంటూ నినాదాలు చేశారు. థాంక్యూ సిఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం బీచ్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు చందూయాదవ్, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు పిఎన్ మూర్తి, సాంబశివరావు, కోయిలాడ పరుశురాం, బందరు శివప్రసాద్, ఉప్పల భాస్కర రావు, ప్రసాద్, ఈశ్వర్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని కాగిత గ్రామంలో ఆగస్టు 18న ఒక ఇంట్లో చొరబడి బంగారం దొంగలించిన నిందితుడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఇంట్లో తులం బంగారం చోరీ కావడంతో అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రాంతం గడువకుర్తి గ్రామానికి చెందిన జర్త బాబులు రెడ్డి వేలిముద్రల ఆధారంగా నిందితుడిగా గుర్తించినట్లు ఎస్ఐ వెల్లడించారు. నిందితుడిని రిమాండ్ కు తరలించామన్నారు.

ఆర్‌టిఐ కన్వీనర్‌గా పొట్ల రాజా

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభను ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని ప్రజా సంకల్ప వేదిక గొలుగొండ మండల (ఆర్టిఐ) కన్వీనర్‌గా పొట్ల రాజా పేర్కొన్నారు. గొలుగొండ మండలానికి తనను ఆర్‌టిఐ కన్వీనర్‌గా నియమించినందుకు నర్సీపట్నం డివిజన్ కన్వీనర్ దుల్లా వీరబాబుకు, జిల్లా అధ్యక్షులు ముప్పినేని వెంకటరమణకు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో సమాచార హక్కు చట్టం వినియోగం, గ్రామసభల్లో పాల్గొనడం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని పొట్ల రాజా తెలిపారు.



నియామకపత్రాన్ని స్వీకరిస్తున్న రాజా

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజక వర్గంలోని నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మొండికండి, అమలాపురం, వేములపూడి ప్రాంతాల్లోని వరి పొలాలను సందర్శించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, తాండవ జలాశయం అధారిత కృష్ణాపురం, మొండికండి తదితర గ్రామాల్లో నీరు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయన్నారు. తాండవ జలాశయం గేట్ల మరమ్మతు చేయక పోవడంతో వేల క్యూసెక్కుల నీరు వృధాగా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, రూరల్ నాయకులు బంగారు నాయుడు, నాతవరం మండల సీనియర్ నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ, జనసైనికులు, రైతులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం కార్మికులకు నష్టం

-జెఎన్‌యు ప్రొఫెసర్ వికాస్‌రావల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నూతన పెన్షన్ విధానం వల్ల కార్మికులకు నష్టం జరుగుతుందని న్యూఢిల్లీ జెఎన్‌యు ప్రొఫెసర్ వికాస్ రావల్ పేర్కొన్నారు. పీపుల్ ఫర్ ఇండియా విశాఖపట్నం ఫోరం ఆధ్వర్యాన ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'ఎన్‌పిఎస్ రద్దు-అందరికీ ఒపిఎస్'అవసరంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2004 వరకు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ అమలయ్యేదన్నారు. చాలా పోరాటాల ఫలితంగా పెన్షన్ వచ్చిందని, దాన్ని అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలుగుతోందని విమర్శించారు. ఎన్‌పిఎస్‌లో జమ అయిన నిధులను స్టాక్ మార్కెట్‌లో పెట్టి, ఆ నిధుల ప్రైవేట్ సంస్థల చేతుల్లో ఉంటాయని, ఎంత పెన్షన్ వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటుందన్నారు.

పాత పెన్షన్ స్కీమ్‌లో వచ్చే పెన్షన్ ఎంత, దాని ప్రయోజనం ఎంత అనేది తెలుస్తుందన్నారు. తద్వారా కార్మికులకు రిటైర్ అయిన తరవాత జీవితం గురించి ధీమా లభిస్తుందన్నారు. ఎల్ఐసి కార్మికులు పోరాటాల్లో మమేకం కావాలని, ఐక్య పోరాటాల వల్ల మాత్రమే ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి, అందరికీ ఒపిఎస్ సాధించడం సాధ్యమన్నారు. కన్వీనర్ ఎం.కామేశ్వరి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, యుటిఎఫ్ నాయకులు తాడాన అప్పారావు, డిఫెన్స్ రంగ నాయకులు అరుణ్, ఎన్.రామకృష్ణ, ఎవిఆర్‌కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న జెఎన్‌యు ప్రొఫెసర్ వికాస్‌రావల్

అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ స్టేడియం

- ఎంపీ వెంకట సత్యవతి

-ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్

-బాలురు విభాగంలో కడప, విశాఖపట్నం

-బాలికల విభాగంలో కడప, అనంతపురం విజేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి: అంతర్జాతీయ ప్రమాణాలతో హాకీ స్టేడియం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బి వెంకట సత్యవతి హామీ ఇచ్చారు. నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్ - 17 బాల బాలికల 67వ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపీ సత్యవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుండి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలు హోరా హోరీగా జరిగాయి. బాలురు విభాగంలో ప్రథమ స్థానంలో కడప, ద్వితీయ స్థానంలో విశాఖపట్నం, తృతీయ స్థానంలో అనంతపురం, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో కడప, ద్వితీయ స్థానంలో అనంతపురం, తృతీయ స్థానంలో చిత్తూరు నిలిచాయి. విజేతలకు ఎంపీ సత్యవతి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నక్కపల్లిలో హాకీ క్రీడా మైదానాన్ని అభివృద్ధికి సహకరించిన హెటిరో యాజమాన్యం, స్థానిక నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాంతంలో హాకీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవుతున్నారని, అన్ని సదుపాయాలతో స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర క్రీడా శాఖ మంత్రికి లేఖ రాస్తానన్నారు.ఎంపీ నిధులు, సి ఎస్ ఆర్ ఫండ్స్ నుండి అన్ని హంగులతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తానని, క్రీడాకారులకు విశ్రాంతి భవనాలు, టాయిలెట్స్ నిర్మాణం చేపడతానని తెలిపారు. నాడు నేడుతో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు విద్య, క్రీడలపై జగనన్న ప్రత్యేక దృష్టి సారించారన్నారు.సీఎం జగన్ తో మాట్లాడి



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎంపి సత్యవతి

స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.నక్కపల్లిలో హాకీ క్లబ్ ఏర్పాటు చేసి విద్యార్థులను హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కే.తాతాజీ, కోచ్ రాంబాబులను సత్కరించారు.

డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ, ప్రపంచ అత్యుత్తమ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ ను స్ఫూర్తిగా తీసుకొని హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఓటమి తోనే గెలుపు సాధ్యమన్నారు.నక్కపల్లి హాకీ క్రీడా మైదానంలో ఆస్ట్రోటార్ఫ్, టాయిలెట్స్, విశ్రాంతి భవనం నిర్మించాలని హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు ఎంపీని కోరారు. హెటిరో ప్రతినిధులు సుబ్బారెడ్డి , కుల్లాయి రెడ్డి, రాజా రెడ్డిలను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ ,ఈశ్వరరావు, ఎంఈఓ నరేష్, ఎస్‌జిఎఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు, జిల్లా సెక్రెటరీ నాగేశ్వరరావు, హెచ్ఎం నూకరాజు, కోడి శ్రీనివాసరావు ,తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలోని తునివలస గ్రామ పంచాయతీ శివారు వింటిపాలెం గ్రామానికి రూ.30 లక్షలతో జల జీవన్ మిషను పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పడాల హైమ శ్రీను, ఎంపీటీసీ స్వాతి కొండబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఇంటింటికి కొళాయి పైపులైను పనులు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పడాల హైమ శ్రీను, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, వైస్ ప్రెసిడెంట్ విస్సారపు జయలక్ష్మి నాగేశ్వరావు, వార్డ్ మెంబెర్ నానాజీ, శిరసపల్లి నాగేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు